క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గ్రీవెన్స్



ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దోమల నియంత్రణపై అవగాహన



కనకమ్మవీధిలో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది సుధాకర్

సీతంపేట: డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణపై 25వ వార్డు కనకమ్మ వీధిలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సుధాకర్ మంగళవారం అవగాహన కల్పించారు. వారం రోజులకు పైబడి మంచి నీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని సూచించారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలపై మూతలు పెట్టాలన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

'బీసీలపై కపట ప్రేమ మానుకోండి'



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మురళీనగర్: బీసీలపై కపట ప్రేమను ఒలకబోస్తున్న తెలుగుదేశం నాయకులు ఇప్పటికైనా తమ నాటకాలను ఆపాలని బత్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్ హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందంటూ టీడీపీ నాయకులు సోమవారం బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో పేర్కొనడాన్ని ఆయన ఖండించారు. ఎన్జీజీవోస్ కాలనీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు ఏమీ చేయలేదని టీడీపీ నాయకులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉందని విమర్శించారు. బీసీల కోసం జగనన్న ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 662 మంది డైరెక్టర్లను నియమించారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీల సంక్షేమం కోసం చేసింది శూన్యమని విమర్శించారు. రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచినంత మాత్రాన ప్రజలంతా టీడీపీ పక్షాన ఉన్నారనుకోవడం భ్రమ మాత్రమేనని అన్నారు. వివిధ పదవులను ఇచ్చి బీసీలకు రాజ్యాధికారం చేరువ చేసిన ఘనత జగనన్నకే చెందుతుందన్నారు. ప్రభుత్వంపై అవాకులు, చెవాకులు మాట్లాడడం మానుకోవాలని, లేదంటే తెలుగు దేశం పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

వేలం పాట వాయిదా

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో నిర్వహించాలనుకున్న దుకాణాల వేలం పాట వాయిదా వేసినట్లు జెడ్సీ కె.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జోనల్ కార్యాలయం నాలుగో అంతస్థులో జీవీఎంసీకి సంబంధించిన షాపుల వేలం నిర్వహించామన్నారు. అయితే ఎవరూ రాకపోవడం వలన దుకాణాల ఆక్షన్ ఈనెల 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు జెడ్సీ తెలిపారు.

రైలు పట్టాలపై.. ప్రమాదపుటంచున



ఆర్పీపేట రైల్వే గేటు సమీపంలో రైలు ఉండగానే.. పక్క నుంచి వస్తున్న స్థానికులు



కంచరపాలెం దయానందనగర్ సమీపంలో పట్టాలు దాటుతున్న కాలనీ వాసులు

- కంచరపాలెంవాసుల రాకపోకలు
- అండర్ పాత్‌వే నిర్మాణానికి వినతులు

కంచరపాలెం: రైలుపట్టాలపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు కంచరపాలెం వాసులు. దయానంద నగర్ సమీపంలో గూడ్స్ రైళ్లు, రామ్మూర్తిపంతులపేట రైల్వే గేటు సమీపంలో ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి రెండు కిలో మీటర్ల దూరాన రైలు పట్టాలకు అవతలి నివాసిత ప్రాంతాలైన ముత్యమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ తదితర కాలనీల నుంచి బయటపడాలంటే వరుసగా ఆరేడు లైన్ల రైల్వే ట్రాకులు దాటాలి. రామ్మూర్తిపంతులపేట, గవర కంచరపాలెం, ధోబీ లైన్ గొల్లకంచరపాలెం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుకు రావాలంటే రెండు మూడు ట్రాకులను దాటాలి. రక్షణ లేని రైలు ట్రాకుల్ని దాటి గమ్యస్థానాలను చేరేందుకు పిల్లలు, పెద్దలు, వృద్ధులని తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఇక్కడ ఫీట్లు చేయాల్సిందే. ఆయా ప్రాంతాలకు వచ్చే అతిథుల పరిస్థితి మరీ దారుణం. రైల్వే ట్రాక్‌లపై అవగాహన లేని ఆయా కాలనీవాసులకు చెందిన బంధువులు ప్రమాదాల బారిన పడి మరణిస్తున్న ఘటనలూ ఉంటున్నాయి. రైలింజన్ల నిర్వహణ, మరమ్మతుల విభాగాలూ, రైల్వే బోగీల వాషింగ్ ఇక్కడే ఏర్పాటు చేయడంతో రోజులో అన్ని సమయాల్లో రైళ్లు తిరుగుతుంటాయి. గతంలో పాదచారులకు ఆర్పీ పేట వద్ద అండర్‌పాత్ వే నిర్మించారు. కానీ రహదారి నిర్వహణ అంతంత మాత్రం కావడంతో వాహనచోదకులకు మాత్రమే ఈ మార్గం అనువుగా ఉంది. పాదచారులు అటుగా నడవడానికి మొగ్గు చూపడంలేదు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా రైల్వే ట్రాకులు దాటుతూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని ఘటనల్లో మరణిస్తున్నారు. లోకోషెడ్ సమీపంలో అండర్ పాత్‌వే నిర్మిస్తే 5, 6 కాలనీల వాసులకు అనువుగా ఉంటుందని తెలియజేస్తున్నారు. ప్రతిపాదన దశలో ఉన్న ఈ నిర్మాణాన్ని కార్యరూపంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అండర్ పాత్ వే నిర్మించాలి

మా కాలనీలకు వెళ్లాలంటే కిలో మీటర్ల మేర ప్రమాదకర పరిస్థితుల్లో నడవాల్సి వస్తోంది. పాదచారుల కోసం అండర్ పాత్ వే నిర్మించాలి. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించాం. మా సమస్య పరిష్కరించాలి

– సంతోష్‌కుమార్, రాజీవ్ కాలనీ, కంచరపాలెం

అధికారులకు విజ్ఞప్తి చేసినా..

అండర్ పాత్ వే నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. రైలు పట్టాలు దాటాలంటే నిత్యం భయమే. ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో స్పందన కనిపించడం లేదు. పిల్లల్ని బయటకు పంపాలంటే భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి అండర్ పాత్‌వే నిర్మాణానికి కృషి చేయాలి.

– నూకరాజు, దయానంద నగర్, కంచరపాలెం

మహిళా పోలీసులకు కళ్లద్దాల పంపిణీ

సీతంపేట: దృష్టి లోపాలతో ఇబ్బంది పడుతున్న 91 మంది మహిళా పోలీస్ సిబ్బందికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 8న స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మంది మహిళా పోలీసు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి మంగళవారం ఉదయం డీసీపీ కార్యాలయంలో కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యమంత్రి కంటి కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ సునీల్ గరుడ్, నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఆప్తమాలిక్ ఆఫీసర్లు ఎం.ఉమాశ్రీనివాస్, ఆర్. సురేష్ పాల్గొన్నారు.



మహిళా పోలీసులకు కళ్లద్దాలు అందిస్తున్న డాక్టర్ విశ్వామిత్ర

వైభవుని సన్నిధిలో పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం చైత్ర పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వైభవునికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఉదయం 6.30గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే వారు మంగళధ్వని, వేదమంత్రోచ్ఛరణతో అభిషేక ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. అనంతరం పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు.



వైభవ వేంకటేశ్వరస్వామి

చురుగ్గా పెన్షన్ల పంపిణీ



53వ వార్డులో పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి



44వ వార్డులో పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ అయూబ్

సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మంగళవారం జోరుగా జరిగింది. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు, ఏప్రిల్ 1, 2 తేదీలు వరుసగా సెలవు కావడంతో ఈ నెల 3వ తేదీ నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. సోమవారం పంపిణీ చేయగా మిగిలిన లబ్ధిదారులకు మంగళవారం ఉదయం నుంచి ఆయా వార్డుల్లో వలంటీర్లు జోరుగా పంపిణీ చేశారు. సెలవుల కారణంగా ఈ నెల పెన్షన్ల పంపిణీ ఆలస్యం అవుతుందని ముందుగానే వలంటీర్ల ద్వారా సమాచారం అందించడంలో ఉన్నతాధికారులు సమన్వయం సాధించారు.

53వ వార్డులో..

మద్దిపాలెం: 53వ వార్డు 300 సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు కార్పొరేటర్ బర్కత్ అలీ, ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, వార్డు పరిశీలకుడు అమర్ కలిసి మంగళవారం పింఛన్లను పంపిణీ చేశారు.

51వ వార్డులో..

సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు మంగళవారం 51వ వార్డు కార్పొరేటర్ సూచన మేరకు 291 సచివాలయం పరిధిలో కన్వీనరు కరిమిరెడ్డి శ్యామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు వినోద్, శిరీష, తులసి పాల్గొన్నారు.

పాఠశాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ తనిఖీలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు సందర్శించారు. స్కూల్‌లోని చైతన్యనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాలల ఆహార పట్టికను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, రాగిజావ, చెక్కిలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సువర్ణ, సీడీపీవో శ్రీలత, పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

458 మందికి వైద్య పరీక్షలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం అశోక్‌నగర్ ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం బౌద్ధాలయంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంచరపాలెం జోనల్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు సుమారు 458 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధాలయం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, ఆస్పత్రి సిబ్బంది, సంఘం సభ్యులు బల్లంకి వెంకటరావు, గండ్రెడ్డి సన్యాసిరావు, అధ్యక్షుడు మల్లువలస రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రాజబాబు, మల్లిబాబు, ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విశాఖ సాహితి ఆవిర్భావ సభ

సీతంపేట: విశాఖ సాహితి ఆవిర్భావ దినోత్సవ సభ స్థానిక పౌర గ్రంథాలయంలో మంగళవారం జరిగింది. సభకు ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విశాఖ సాహితి సంస్థ 50 ఏళ్లుగా ఎందరో కవులు, రచయితలను ప్రోత్సహిస్తుందన్నారు. గౌరవ అతిథులు సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వై.వి.అనూరాధ మాట్లాడుతూ విశాఖ సాహితి సేవలను కొనియాడారు. అనంతరం స్మారక కథల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గండికోట విశ్వనాథం, డి.వి.సూర్యారావు, కందాళ కనకమహాలక్ష్మి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

క్రిటికల్ థింకింగ్‌పై పోటీ పరీక్షలు

బీచ్ రోడ్డు: విద్యార్థుల్లో సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు క్రిటికల్ థింకింగ్‌పై హెచ్‌సీఎల్ జిగ్సా 4వ సీజన్ పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్టు హెచ్‌సీఎల్ ప్రతినిధి రజత్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 31వ తేదీలోగా hcljigsaw.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

'జగనన్నే మన భవిష్యత్తు' నినాదంతో ప్రజల్లోకి..



కిట్లు అందిస్తున్న 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



కన్వీనర్లు, గృహసారథులతో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంపై పలు వార్డుల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. పార్టీ వార్డు కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ అల్లు శంకరరావు 280, 281, 282, 283 వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశమయ్యారు. కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్‌ను వారికి నచ్చితేనే ఇంటి తలుపుకు అంటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భత్రాజుల డెవలప్‌మెంట్ డైరెక్టర్ నిడిమోళి రవికుమార్, విశాఖ ఏఎంసీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రొంగలి మౌళి, కర్రి రామిరెడ్డి, కె.మున్నా, పిల్లి నాగరాజు, బొట్ట శంకర్, పల్లా చైతన్య, చిట్టి బోయిన శ్యామల, రొంగలి పావని పాల్గొన్నారు.

- జీవీఎంసీ 51వ వార్డులో 287, 288, 291 సచివాలయ పరిధిలో ఉన్న కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మంగళవారం అంబేడ్కర్ కాలనీ సచివాలయంలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారికి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పైడి ప్రతాప్, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, ధర్మవతి, వరలక్ష్మి, లత, నూకరాజు, ధర్మేంద్ర, గణేష్, వినోద్, భాను పాల్గొన్నారు.

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు 292, 293, 288 సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ వార్డు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పనులు వివరించి వారితో మమేకమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బగాది విజయ్‌కుమార్, పైడి కృష్ణారావు, పొన్నాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

53వ వార్డులో..

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు 298 సచివాలయం పరిధిలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్లు, గృహసారథులతో సచివాలయంలో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, వార్డు పరిశీలకుడు అమర్, కన్వీనర్లు ఝాన్సీ, షేక్ బాబ్జీ, చాందిని, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా 46వ వార్డు శాంతినగర్ సచివాలయంలో కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విజయమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. ఈ నెల 7 నుంచి సచివాలయ పరిధిలో ప్రభుత్వం ఇస్తున్న ప్రచార కిట్టును ప్రతీ గడపకు వెళ్లి ఇవ్వాలని వారిని కోరారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత



గర్భిణీలకు జగనన్న కిట్లు అందజేస్తున్న గౌరి

సీతమ్మధార : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను గర్భిణులు, బాలింతలకు మంగళవారం నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ గౌరీ పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా జొన్నపిండి, బెల్లం, అటుకులు, ఎండు ఖర్జూరం, వేరుశనగ అచ్చు, రాగిపిండి, గుడ్లు అందజేశారు. ఈ సెంటర్‌లో గర్భిణులు 27 మంది, బాలింతలు 31 మంది ఉన్నట్టు ఆమె తెలిపారు.

పక్కాగా సమాచారం నమోదు చేయాలి

మహారాణిపేట : ఆశ డే సందర్భంగా స్వర్ణభారతి స్టేడియం వద్ద గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో కిల్కారి మొబైల్ సేవల గురించి ప్రస్తావించారు. డాక్టర్ అనిత ద్వారా ప్రతి గర్భిణికి కిల్కారి యాప్ సేవల సమాచారం పంపబడుతుందన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త తన పరిధిలో నమోదైన గర్భిణీ విధిగా కిల్కారి సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ డే సందర్భంగా ప్రోగ్రాం అధికారులు తమ ఆశ కార్యకర్తలకు కిల్కారి యాప్ గురించి, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆశ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

గర్భిణులు, బాలింతల బాధ్యత ఆశ వర్కర్లదే

కంచరపాలెం: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ఆశ వర్కర్లు చిత్తశుద్ధితో పని చేయాలని డీటీసీవో ప్రోగ్రాం అధికారి డాక్టర్ పురేంద్ర అన్నారు. మంగళవారం భవానీ గార్డెన్స్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శివనగర్, ఆర్పీపేట, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీల ఆశ వర్కర్లతో ×ఆశ డే×కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు క్లస్టర్లలో మహిళల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. పౌష్టికాహారానికి సంబంధించిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏఎల్ శాంతి, ఏఎం ఏంజెలినా, పీఆర్‌వో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పురేంద్ర

సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి



సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న



వేణుగోపాలస్వామిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.